క్లుప్తంగా

నేడు పూలే జయంతి

కపిలేశ్వరపురం: సామాజికవేత్త జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను మంగళవారం స్థానిక బస్‌స్టాండ్ సమీపంలోని పూలే విగ్రహం వద్ద నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

గాళ్లు రాకుండా పశువులకు వ్యాక్సిన్



తెలికిచెర్ల ఆర్బీకే వద్ద పశువులకు గాళ్ల నివారణ వ్యాక్సిన్ వేస్తున్న ఏడీఏ మోజెస్ వెస్లీ

నల్లజర్ల: అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద పశువైద్యం అందుబాటులో ఉందని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ నల్లజర్ల ఏడీఏ మోజెస్ వెస్లీ అన్నారు. తెలికిచెర్ల-2 గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం పశువులకు గాళ్లు రాకుండా వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాన్ని తెలికిచర్ల పంచాయతీ సర్పంచ్ బండి చిననాగరాజు (చిట్టి) ప్రారంభించారు. ఈసందర్భంగా 50 పశువులకు ఫుట్ అండ్ మౌత్ డీసీజెస్ రాకుండా వ్యాక్సిన్ వేశారు. పశువైద్య సహాయకుడు జయంత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పిట్టల వేమవరంలో అవగాహన సదస్సు

పెరవలి: పశువుల్లో హఠాత్తుగా జ్వరం, నోటిలోను, గిట్టల మధ్య పుండ్ల వంటి లక్షణాలు కనిపిస్తే గాలికుంటు వ్యాధి సోకినట్లు గుర్తించాలని పశువైద్యాధికారి సల్మా రైతులకు సూచించారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించే అంశంపై మండలంలోని పిట్టల వేమవరం గ్రామ రైతులకు సోమవారం ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు.

రేషన్ షాపుల నిర్వాహకులపై 6ఏ కేసు

పెరవలి: కానూరు గ్రామంలోని 38, 39 నంబర్ల రేషన్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం సోదాలు జరిపారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌తో పోలిస్తే 38వ నంబర్ షాపులో 380 కిలోల బియ్యం, 12 కిలోల పంచదార వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. అలాగే 39వ నంబర్ రేషన్ షాపులో 75 కిలోల బియ్యం, పంచదార, కందిపప్పు వ్యత్యాసాన్ని గుర్తించారు. దాంతో ఆ ఇద్దరు డీలర్లపై 6ఏ కేసు నమోదు చేశామని ఈ తనిఖీలకు సారథ్యం వహించిన విజిలెన్స్ సీఐ రమేష్ తెలిపారు. ఈ రెండు రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతను పక్కనే ఉన్న షాపులకు అప్పగించామని చెప్పారు.

రాయితీపై సాగు యంత్రాల మంజూరు

చాగల్లు: వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా మండల రైతులకు రాయితీపై సాగు యంత్రాలు మంజూరయ్యాయని ఏవో కె.వేణుగోపాల్ సోమవారం తెలిపారు. చాగల్లు-4, నెలటూరు-1, చిక్కాలపాలెం-1, ఊనగట్ల ఆర్బీకేల పరిధిలో రూ.60 లక్షల విలువ చేసే ట్రాక్టర్లు, వాటికి సంబంధించిన పనిముట్లు మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తంలో రూ.26 లక్షల రాయితీ ఉంటుందన్నారు. అలాగే చాగల్లు ఆర్బీకే పరిధిలో రూ.8.80 లక్షల రాయితీపై రూ.26 లక్షల విలువైన వరి కోత యంత్రం మంజూరైందని ఏవో వివరించారు.

టెన్త్ పరీక్షలకు 1,248 మంది హాజరు

కొవ్వూరు: సోమవారం నిర్వహించిన పదో తరగతి లెక్కల పరీక్షకు మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో 1,248 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో జె.కెంపురత్నం తెలిపారు. మొత్తం 1,272 మందికి గాను 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఐ.పంగిడి జెడ్పీ ఉన్నత పాఠశాల లో 147కి 145 మంది, కుమారదేవంలో 139 మందికి 136, వాడపల్లి హైస్కూలులో 220కి 219 మంది, కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 189కి గాను 186 మంది, పీఎంఎం హైస్కూలులో 148కి గాను 142మంది, జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో 149కి గాను 146 మంది, సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూలులో 130కి 126 మంది, దీప్తి ఇంగ్లిషు మీడియం హైస్కూలులో 150కి గాను 148 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

రంగా- రాధా మిత్రమండలి పదవులకు రాజీనామా

కొవ్వూరు: జనసేన నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి సోమవారం సాయంత్రం దొమ్మేరు గ్రామంలోని సంతపేట వద్ద నిరసన తెలిపారు. దొమ్మేరులో ఆదివారం వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ సభ ముగిశాక వైఎస్సార్ సీపీ నాయకులు జనసేన నాయకుడైన ముక్కా శ్రీనివాసరావుపై దాడి చేశారని వారు ఆరోపించారు. విగ్రహావిష్కరణ సభలో జనసేన నాయకులకు సముచిత గౌరవం ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో రంగా- రాధా మిత్రమండలి పదవులకు తాము రాజీనామా చేస్తున్నట్టు వారు ప్రకటించారు. మారిశెట్టి వెంకటేశ్వరరావు, తొర్లపాటి షీతల్, డేగల రాము, చెట్టే సుభాషిణి, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యుడు పసలపూడి పండు, రేగమండ రమేష్, కళ్లేపల్లి ప్రభాస్ పాల్గొన్నారు.

ఉపవాస వేళ.. గంజితో సత్తువ

- రంజాన్ దీక్షాపరులకు పంపిణీ
- ముస్లింల కోసం మసీదుల్లో ప్రత్యేకంగా తయారీ



సమిశ్రగూడెంలో గంజి తయారు చేస్తున్న ముస్లిం మహిళలు

నిడదవోలు రూరల్: రంజాన్ ఉపవాస దీక్షల్లో 'గంజి'కి విశేష ప్రాధాన్యం ఉంది. నిడదవోలు పట్టణంతో పాటు సమిశ్రగూడెం, తాడిమళ్లతో సహా పలు గ్రామాల్లోని మసీదుల్లో ఇఫ్తార్ నిర్వహించే వేలాది మంది దీక్షాపరుల కోసం గంజిని పంపిణీ చేస్తున్నారు. ఉపవాసం ఉండే వారి శరీరంలోని వేడిని ఒక్కగ్లాసు గంజి తగ్గిస్తుందని ముస్లింలు చెబుతున్నారు. బలవర్ధక ఆహారంగా పేరొందిన ఈ వంటకాన్ని ముస్లింలు ప్రత్యేకంగా మసీదుల వద్దే తయారు చేస్తారు. ఉపవాస దీక్ష విరమణ సమయంలో చిన్న, పెద్ద అని తేడా లేకుండా ఒక్క గ్లాసు గంజినైనా తాగేందుకు పోటీ పడతారు. రంజాన్ నెల మొత్తం మసీదుల్లో ఉపవాస దీక్షాపరులకు గంజిని పంపిణీ చేస్తున్నారు. మసీదులు, ఇళ్లల్లో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఈ గంజి తయారీని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 నుంచి పంపిణీ ప్రారంభించి, 6.30 గంటలకు ద్రావణాన్ని సిద్ధం చేసి ఇఫ్తార్‌లో పాల్గొన్న దీక్షాపరులకు అందజేస్తుంటారు.

గంజి తయారీ ఇలా..

ఇఫ్తార్ గంజిని ముస్లింలు స్పెషల్‌గా సిద్ధం చేస్తారు. బియ్యం రవ్వ లేదా బొంబాయి రవ్వ, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, టమోటా, కొత్తిమీర, పుదీనా, కరివేపాకు, పచ్చిమిర్చి, వేరుశనగ గుళ్లు, లవంగాలు, యాలకులు, నూనె, నెయ్యి ఉపయోగించి గంజి తయారు చేస్తారు. కొన్ని మసీదుల్లో ఈ గంజి తయారీలో ఖీమా కూడా వినియోగిస్తారు. సాయంత్రం నమాజ్‌ల తర్వాత ఇళ్లకు గంజి పంపిణీ చేస్తారు. మసీదుల్లో గిన్నెలో వేసి ఇఫ్తార్‌కు వచ్చేవారికి అందిస్తారు. గంజిలో బూందీ వేసుకుని ఇష్టంగా తింటారు.

మంచి శక్తి ఇస్తోంది



ఇస్లాం ధర్మంలో రంజాన్ మాసానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. 30 రోజుల పాటు చిన్న, పెద్ద అనే వయస్సు తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉపవాస దీక్షలో ఉంటారు. తీసుకునే ఆహారంలో మార్పులు ఉంటాయి. రోజా ఉపవాస విరమణ అనంతరం గంజిని తీసుకోవడం వల్ల అలసట రాకుండా మంచి శక్తిని ఇస్తోంది. దీక్ష చేస్తున్న వారిందరికీ అందించాలనే లక్ష్యంతో ముస్లింలు అందరి కోసం రోజుకు కొంతమంది చొప్పున గంజి తయారు చేసి పంపిణీ చేస్తారు.

– షేక్ వజీరుద్దీన్, వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు, నిడదవోలు

మంత్రిని కలిసిన పర్వతారోహకుడు ఉమేష్



మంత్రి తానేటి వనితకు తన సర్టిఫికెట్లు చూపుతున్న ఆచంట ఉమేష్‌కుమార్

కొవ్వూరు: రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు, పర్వతారోహకుడు ఆచంట ఉమేష్‌కుమార్‌ను సోమవారం హోం మంత్రి తానేటి వనిత అభినందించారు. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉమేష్ కుమార్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఉమేష్ కుమార్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో అత్యంత ఎత్తైన పర్వతాల్లో ఇప్పటికే మూడు ఖండాల్లో అధిరోహించినట్లు ఆ యువకుడు మంత్రికి తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సర్టిఫికెట్లు మంత్రికి చూపించారు. ఈ ఏడాది ప్రపంచంలోనే ఎత్తైన పర్వతం మౌంట్ ఎవరెస్టను అధిరోహించడానికి సన్నద్ధం అవుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున తగిన ప్రోత్సాహం , తోడ్పాటు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సంక్షేమ సారథికి అండగా నిలవాలి

- హోం మంత్రి తానేటి వనిత
- గృహ సారథులు, వలంటీర్లతో సమావేశాలు
- జగనన్నే మా భవిష్యత్తు కిట్ల పంపిణీ



గృహ సారథులు, వలంటీర్లకు కిట్లు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



సమావేశానికి హాజరైన గృహసారథులు, వలంటీర్లు

తాళ్లపూడి: కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని హోం మంత్రి తానేటి వనిత కోరారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, వలంటీర్లతో సోమవారం తాళ్లపూడిలోని సొలస దమయంతి ఆర్య వైశ్య కల్యాణ మండపంలోను, మలకపల్లిలోని కల్యాణ మండపంలోనూ సమావేశాలు నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశాల్లో ఆమె అన్నారు. ఈ నెల 20లోగా గృహ సారథులు, వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మంత్రి వనిత జగనన్నే మా భవిష్యత్తు కిట్లను వారికి అందజేశారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు సిద్ధంశెట్టి కృష్ణ, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు నక్కా అనురాధ, కొమ్మిరెడ్డి పరశురామారావు, నామా శ్రీనివాస్, గండి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఆత్కూరి దొరయ్య, నక్కా చిట్టి బాబు, యాళ్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రంలో విద్యాశాఖ జేడీ తనిఖీలు



నిడదవోలులో జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మధుసూదనరావు

చాగల్లు: మార్కొండపాడులోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డి.మధుసూదనరావు సోమవారం తనిఖీ చేశారు. అక్కడి జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో గణితం పరీక్ష నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఏఎంవో గౌరిశంకర్, ఎంఈవో వి.ఖాదర్ బాబు తదితరులు ఉన్నారు.

స్కూళ్లు తెరిచే నాటికి విద్యాకానుక కిట్లు సిద్ధం

నిడదవోలు రూరల్: వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు తెరిచే నాటికి జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూదనరావు అన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు భద్రపరిచేందుకు నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం స్కూల్లో గుర్తించిన స్టాక్ పాయింట్‌ను సోమవారం విద్యాశాఖాధికారులు పరిశీలించారు. పరిసరాలను తనిఖీ చేశారు. డీఈఓ ఎస్.అబ్రహం, ఎంఈఓ డి.కిషోర్ కుమార్, సీఆర్పీలు ఎస్.రాజేంద్ర, జె.రవి, రామచంద్రన్ తదితరులు ఉన్నారు.

జగన్ పథకాలు చరిత్రాత్మకం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కాటకోటేశ్వరంలో జగనన్నే మా భవిష్యత్తు



కాటకోటేశ్వరంలో స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నల్లజర్ల మండలం శింగరాజుపాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కానూరులో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: నవరత్నాల పథకాల ద్వారా గత నాలుగేళ్లలో రాష్ట్రంలో పేద ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేరుగా రూ.2 లక్షల కోట్లు అందించడం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, వలంటీర్లు, గృహ సారథులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనపై ప్రజాభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ విపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా 2024 ఎన్నికల్లో ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌కు మళ్లీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాటకోటేశ్వరం గ్రామంలో సీసీ డ్రైన్లు, రోడ్లు నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేశామన్నారు. అనంతరం లబ్ధిదారుల ఆమోదంతో ఇళ్లకు, సెల్‌ఫోన్‌లకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు స్వయంగా స్టిక్కర్లు అంటించారు. ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, వైఎస్సార్ సీపీ నాయకులు కోసూరి అప్పారావు, గుంటుపల్లి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలోని 24 వార్డుల్లోను, మండలంలోని అట్లపాడు, పందలపర్రు, పెండ్యాల, కంసాలిపాలెం, తాడిమళ్ల, సమిశ్రగూడెం గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు సారథ్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను సేకరించారు. సీఎం జగన్ పాలనపై సంతృప్తికరంగా ఉన్న వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించి, వారి సెల్‌ఫోన్ల నుంచి మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఎండీ షాకీరాబేగం, అహ్మదున్నీషాబేగం, మస్తాన్ వలీ, ఎండీ ఫయాజ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా నినాదంగా జగనన్నే మా భవిష్యత్తు

నల్లజర్ల: 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రజా నినాదంగా మారిపోయిందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని శింగరాజుపాలెం గ్రామంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, సర్పంచ్ గద్దే బాలగంగాధర తిలక్, ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారిలతో కలసి సోమవారం ఆయన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలకూ లబ్ధి చేకూరేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి గడపకూ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి పలు కుటుంబాలను ఎమ్మెల్యే వెంకట్రావు కలిశారు. వారి అభిప్రాయాలను ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేశారు. ప్రతి ఇంటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల జయనారాయణ, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెరవలి: పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ కోరారు. మండలంలోని ఖండవల్లి, లంకమాలపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే కానూరులో జెడ్పీటీసీ సభ్యుడు కొమ్మిశెట్టి రామాంజని ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు, రవి, పార్టీ నాయకులు కొమ్మిశెట్టి రాము, కరుటూరి గోపి, బీరా రాజు, అంబటి బ్రహ్మయ్య తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

గోపాలపురం: తన స్వగ్రామమైన మండలంలోని వాదాలకుంటలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. స్టిక్కర్లు పంపిణీ చేశారు. సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ, జె శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెద్దాపురంలో మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ, దొండపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సగ్గొండలో పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు యండపల్లి కవిత జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవరపల్లి: గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని తెలుసుకోవడానికి చేపట్టిన జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి గల తేడాను ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2746 మంది గృహసారథులు, 243 మంది గ్రామ సచివాలయ కన్వీర్లు, నలుగురు మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు గృహాలను సందర్శిస్తున్నారు.

వలంటీర్లకు వందనానికి తరలి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరాస్వామి

చాగల్లు: ఈ నెల 14న కొవ్వూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమానికి వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ మట్టా వీరాస్వామి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వద్ద సచివాలయ కన్వీనర్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఎంపీపీ వీరాస్వామి మాట్లాడుతూ సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 12న కలవలపల్లి, నెలటూరులలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం శాఖ మంత్రి తానేటి వనిత హాజరవుతారన్నారు. సర్పంచులు మట్టా వెంకట్రావు, మద్దిపాటి శ్రీరామమూర్తి, కంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు చార్జీలు తగ్గించాలంటూ టీడీపీ ఆందోళన

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిడదవోలు డీఈ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నాలుగేళ్లలో నిత్యావసరాల ధరలు, పన్నులు పెంచారని శేషారావు విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: విద్యుత్ చార్జీలకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు కొవ్వూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం ధర్నా చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఎస్సీలకు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏడీఈ అచ్యుతాచారి వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు దాయిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ మండల నాయకులు ప్రక్కిలంక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. అనంతరం వారు ఏఈకి వినతి పత్రం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నాయకులు కొఠారు వెంకటరావు, కైగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిలకడగా నిమ్మ మార్కెట్

దేవరపల్లి: మార్కెట్లో నిమ్మకాయల ధర నిలకడగా కొనసాగుతోంది. మండలంలోని యాదవోలు మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.55 నుంచి 60 పలుకుతోంది. గత వారం కంటే ఈ వారం కిలో రేటు రూ.10 పెరిగినట్టు రైతులు తెలిపారు. అయితే ఆశించినంతగా ధర లేకపోవడంతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. గతేడాది ఏప్రిల్‌లో కిలో రూ.160 నుంచి 180 ధర పలికింది. ఈ ఏడాది కనీసం సగం ధర కూడా లేకపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. ఈ ధర గిట్టుబాటు కాదని, కనీసం రూ.100 ఉంటే పెట్టుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. తోటల్లో తయారైన కాయలు లేక పసరకాయలు కోసి మార్కెట్‌కు తీసుకు వస్తున్నారని, దీనివల్ల ధర తక్కువ పలుకుతోందని వ్యాపారులు అంటున్నారు.

కాపవరంలో అభివృద్ధి పనుల జోరు

పెరవలి: మండలంలోని కాపవరంలో డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒక్కో సచివాలయం పరిధిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ విధంగా మంజూరైన 20 లక్షల నిధులకు, కాపవరం పంచాయతీకి చెందిన రూ.మరో 20 లక్షలు, పెరవలి మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు జత చేశారు. ఈ మొత్తం రూ.50 లక్షల వ్యయంతో కాపవరం పంచాయతీ పరిధిలో డ్రైన్లతో పాటు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయని ఆ పంచాయతీ సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీరావు ఆదివారం తెలిపారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో రోడ్లు, డ్రైన్ల సమస్య తీరుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్‌కు గాయాలు

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఖండవల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కుమారదేవంలో పెయింటింగ్ పనికి వెళ్లి సైకిల్‌పై స్వగ్రామం ఆరికిరేవుల వస్తుండగా వేగంగా వస్తున్న లారీ అతడిని ఢీ కొట్టింది. శ్రీనివాసరావు కాలి పై నుంచి లారీ టైర్ ఎక్కడంతో అతడి కాలు నుజ్జునుజ్జయ్యింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఆసుపత్రిలో క్షతగాత్రుడు చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి సోమవారం అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

సంఘ విద్రోహ శక్తులను శిక్షించాలి

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటును అడ్డుకుంటున్న సంఘ విద్రోహ శక్తులను కఠినంగా శిక్షించాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు గెద్దం రవీంద్ర బాబు డిమాండ్ చేశారు. ఈనెల 11న జ్యోతిరావు పూలే, 14న బీఆర్ అంబేద్కర్ జయంత్యోత్సవాలను వాడవాడలా నిర్వహించాలని కోరుతూ కరపత్రాలను సోమవారం కేఎన్‌పీఎస్ నాయకులు సమిశ్రగూడెంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దిద్దే వరుణ్, యు.సన్నీ, ఎ.బిట్టు, డి.సతీష్, ఎం.శ్రీను పాల్గొన్నారు.